రుణ మాఫీ కాని రైతుల వివరాల సేకరణ

వికారాబాద్: పీరంపల్లిలో రుణమాఫీ కాని రైతుల వివరాలను సేకరిస్తున్న విధానాన్ని పరిశీలిస్తున్న డీఏవో మోహన్‌రెడ్డి

వికారాబాద్, ఆగస్టు 29 : రుణమాఫీ జరుగని రైతులకు, రేషన్ కార్డుల్లేని వారి కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం వికారాబాద్ మండల పరిధిలోని పీరంపల్లి గ్రామంలో రుణ మాఫీ కాని రైతుల వివరాలను వ్యవసాయాధికారులు యాప్ ద్వారా ఫ్యామిలీ గ్రూపింగ్ సర్వేను పరిశీలించారు. ఇందులో రుణమాఫీ జరుగని, రేషన్‌కార్డు లేని రైతుల వివరాలను యాప్‌లో అప్లోడ్ చేయాలని, వ్యవసాయాధికారి స్వయంగా సంబంధిత రుణమాఫీ జరుగని రైతుకుటుంబంతో సెల్ఫీ తీసుకొని ఆ యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నట్లు రుణ మాఫీ జరుగకపోవడానికి పలు కారణాలున్నాయని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు. రైతులకు సంబంధించిన ఆధార్ కార్డులో లేదా బ్యాంకు ఖాతాలో తప్పుడు పేర్లు నమోదు కావడం ద్వారా రుణ మాఫీ కాలేదన్నారు. వారి వెంట మండల వ్యవసాయాధికారి జ్యోతి, వ్యయసాయ విస్తరణ అధికారి కావ్య తదితరులు పాల్గొన్నారు

కులకచర్ల: మండల పరిధిలోని ముజాహిద్‌పూర్ గ్రామ రెవెన్యూ పరిధిలోని రుణమాఫీ కాని రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి వీరస్వామి మాట్లాడుతూ అర్హులైన వారి వివరాలను యాప్‌లో నమోదు చేస్తున్నట్లు తెలిపారు. లిస్టులో ఉన్న వారందరి నుంచి దరఖాస్తులను స్వీకరించనున్నట్లు తెలిపారు. శుక్రవారం కులకచర్ల మండల పరిధిలోని పుట్టపహాడ్‌లో మధ్యాహ్నం 1.30లకు, 31న ఉదయం 9గంటలకు బండవెల్కిచర్ల రెవెన్యూ గ్రామంలో, మధ్యాహ్నం 3 గంటలకు బొంరెడ్డిపల్లి గ్రామంలో, సెప్టెంబర్2, ఉదయం 9గంటలకు రాంరెడ్డిపల్లి గ్రామంలో, 1గంటలకు అల్లాపూర్ గ్రామంలో, సెప్టెంబర్ 3న ఇప్పాయిపల్లి, రాంపూర్ గ్రామాలు, సెప్టెంబర్ 4న ఉదయం10 గంటలకు పీరంపల్లి, సెప్టెంబర్ 5న చెల్లాపూర్, సాల్వీడ్, ఘనాపూర్(అల్మాస్‌ఖాన్‌పేట్), సెప్టెంబర్ 6న కుస్మ సముద్రం, అనంతసాగర్, సెప్టెంబర్ 9న తిరుమలాపూర్ గ్రామాల్లోని రైతు వేదికల్లో, గ్రామ పంచాయతీ భవనాల్లో రుణమాఫీ కాని రైతుల వివరాలను పరిశీలించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు, గ్రామస్తులు, అధికారులు పాల్గొన్నారు.

కులకచర్ల: ముజాహిద్‌పూర్‌లో రైతు రుణమాఫీ కాని లబ్ధిదారులతో దరఖాస్తులు స్వీకరిస్తున్న మండల వ్యవసాయాధికారి వీరస్వామి

270 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు

బొంరాస్‌పేట, ఆగస్టు 29 : మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో కంటిచూపు అవగాహన కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్యులు నాగేశ్వర్‌రావు, దివ్య 270 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. 26 మంది విద్యార్థులకు దృష్టిలోపం ఉన్నట్లు గుర్తించారు. వీరికి త్వరలోనే కళ్లద్దాలు అందజేస్తామని వైద్యులు తెలిపారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ కంటిచూపు సమస్యలు ఉన్నవారు ఆరోగ్యకరమైన జీవన శైలిని అవలంభించాలని, టీవీ చూడడం, మొబైల్ ఫోన్ వాడకం తగ్గించాలని, ఆకు కూరలు, కూరగాయలు, తాజా పండ్లు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్ఎం కాశయ్య, ఉపాధ్యాయులు బాకారం మల్లయ్య పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్

బొంరాస్‌పేట, ఆగస్టు 29 : క్రీడలు విద్యార్థులకు మంచి భవిష్యత్తును ఇస్తాయని బొంరాస్‌పేట జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు బాకారం పీఈటీ చంద్రశేఖర్, శ్రీకాంత్ అన్నారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని, తెలుగు భాషా దినోత్సవాన్ని గురువారం పాఠశాలలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ హాకీలో ధ్యాన్‌చంద్ సాధించిన విజయాలను విద్యార్థులకు వివరించారు. ఆటలు ఆడడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. చదువుతో పాటు విద్యార్థులు ఆటల్లో రాణించాలని సూచించారు. అదేవిధంగా తెలుగు భాషకు గిడుగు రామ్మూర్తి పంతులు చేసిన కృషిని తెలుగు పండిత్ గుంజ వెంకటయ్య విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మల్లయ్య, లక్ష్మీకాంత్, శివరాజ్, భవానీ, విద్యార్థులు పాల్గొన్నారు.

పలువురు కాంగ్రెస్‌లో చేరిక..



కులకచర్ల, ఆగస్టు 29 : మండల పరిధిలోని రాంరెడ్డిపల్లి గ్రామంలో వివిధ పార్టీలకు చెందిన ఆనెమోని నర్సింహులు, బుగ్గయ్య, కుమ్మరి నర్సింహులు, మల్లేశ్, రాజు, భీమయ్య తదితరులు గురువారం పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు నర్సింహులుయాదవ్, లక్ష్మయ్యగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, చంద్రయ్య, ఇస్వయ్య, చెన్నయ్య, రమేశ్, నర్సింహులు, రాములుగౌడ్, అంబోజిరావు, కుమ్మరి రమేశ్, కుమ్మరి కృష్ణయ్య, కుమ్మరి వెంకటేశ్, కుమ్మరి యాదయ్య, కుమ్మరి శ్రీనివాస్, చెంచు అంజిలయ్య, చెంచు ఆశయ్య, ఆనెమోని నర్సింహులు పాల్గొన్నారు.

జిల్లాలో మోస్తరు వర్షం

వికారాబాద్, ఆగస్టు 29 : వికారాబాద్ జిల్లాలో గురువారం మోస్తరు వర్షం కురిసింది. వర్షానికి రోడ్లన్నీ జలమయం అయ్యాయి.

జిల్లాలో వర్షపాతం వివరాలు ...

మర్పల్లిలో 0.4 మిల్లిమీటర్ల వర్షం కురిసింది. మోమిన్‌పేట 8.7, నవాబుపేట 8, వికారాబాద్ 5, పూడూరు 3.5, పరిగి 3.8, కులకచర్ల 5.8, దోమ 4.6, బొంరాస్‌పేట 3.1, ధారూరు 4, కోట్‌పల్లి 5.5, బంట్వారం 6.5, పెద్దేముల్ 5.3, తాండూరు 5.1, బషీరాబాద్ 5.7, యాలాల 4.3, కొడంగల్ 3.6, దౌల్తాబాద్ 4.8, చౌడాపూర్ 1.7, దుద్యాల 3.9 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

పరిగిలో భారీ వర్షం

పరిగి, ఆగస్టు 29 : పరిగిలో గురువారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. సుమారు గంటకు పైగానే కురిసిన భారీ వర్షంలో వాగులు, వరదనీటితో ప్రవహించాయి. పరిగి పట్టణంలోని బీసీ కాలనీలో వర్షం నీరు ఇళ్ల మధ్య నుంచి రోడ్డుపై ప్రవహించాయి. ఈ వర్షాకాలంలోనే గురువారం భారీ వర్షం కురిసింది. దీంతో చెరువులలోకి నీళ్లు చేరాయి.

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలి



ఇంటింటికీ మొక్కలు పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల

వికారాబాద్, ఆగస్టు 29 : మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని వికారాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల అన్నారు. గురువారం స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ ఆదేశాల మేరకు వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని 14, 24, 25, 33 వార్డుల్లో ఇంటింటికీ మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాలనీ వాసులతో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఇంటిముందు మొక్కలు నాటి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి అన్నారు. వర్షాకాలం కారణంగా సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అర్థ సుధాకర్ రెడ్డి, కౌన్సిలర్లు శ్రీదేవి సదానంద్ రెడ్డి, రామస్వామి, నాయకులు సదానంద్ రెడ్డి, శానిటేషన్ ఇన్‌చార్జి ఎస్సై యేసు, ఎన్విరాన్మెంటల్ ఇంజినీర్ శ్రీనివాస్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

ఒగ్గు కళాకారులకు జానపద కళా పురస్కారం



కళాకారులకు పురస్కారం అందజేస్తున్న డీఆర్‌డీవో శ్రీనివాస్‌గౌడ్

బొంరాస్‌పేట, ఆగస్టు 29 : మండలంలోని నాందార్‌పూర్ గ్రామానికి చెందిన శ్రీ మల్లికార్జున ఒగ్గు కళా సమితి కళాకారులు జానపద యువ కళారత్న పురస్కారం అందుకున్నారు. కొడంగల్ నియోజకవర్గంలోని కోస్గి పట్టణంలో గురువారం భాషా సాంస్కృతిక శాఖ, నారాయణపేట, వికారాబాద్ జిల్లాల సంయుక్త ఆధ్వర్యంలో జానపద జాతర కార్యక్రమం నిర్వహించారు. గత పదేళ్లుగా ఒగ్గు కళకు అందిస్తున్న సేవలకు గాను ఈ పురస్కారాన్ని నారాయణపేట జిల్లా డీఆర్‌డీవో శ్రీనివాస్‌గౌడ్ కళాకారులకు అందించారు. అంతకు ముందు కోస్గి పట్టణంలో వివిధ జానపద కళాకారులు ర్యాలీ నిర్వహించారు. ప్రదర్శనలో ఒగ్గు కళాకారుల ప్రదర్శన హైలట్‌గా నిలిచింది. కార్యక్రమంలో మండలం నుంచి జానపద కళాకారులు పాల్గొన్నారు. తమకు పురస్కారం లభించడం పట్ల ఒగ్గు కళాసమితి అధ్యక్షుడు బీరప్ప హర్షం వ్యక్తం చేశారు.

బాధితుడికి సెల్‌ఫోన్ అప్పగింత

పెద్దేముల్, ఆగష్టు 29 : మండల పరిధిలోని అడికిచెర్ల గ్రామానికి చెందిన బద్వా పటేల్ తన సెల్‌ఫోన్ చోరీ అయిందని మూడు నెలల క్రితం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. జరిగిందన్నారు. పోలీసులు సెల్‌ఫోన్ వివరాలను సీఈఐఆర్ అప్లికేషన్ యాప్‌లో నమోదు చేసి ఫోన్‌ను ట్రేస్ చేసి బాధితుడు బద్వా పటేల్‌కు గురువారం ఎస్ఐ కె.గిరి అప్పగించాడు కార్యక్రమంలో ఏఎస్ఐ బక్కన్న ఉన్నారు.

కొత్తూరు నుంచి దేవనూరుకు బీటీ రోడ్డు నిర్మించాలి

బొంరాస్‌పేట, ఆగస్టు 29 : మండలంలోని కొత్తూరు నుంచి దేవనూరు వరకు బీటీ రోడ్డు నిర్మించాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు చంద్రయ్య, కేఎన్‌పీఎస్ నాయకుడు లక్ష్మయ్య, మాజీ సర్పంచ్‌లు ధాక్యానాయక్, బాలప్ప తదితరులు కోరారు. గురువారం వారు కొత్తూరులో మాట్లాడుతూ కొత్తూరు నుంచి దేవనూరు వరకు మట్టి రోడ్డు అధ్వానంగా ఉందని, బస్సులు రాకపోవడంతో ప్రయాణికులు, విద్యార్థులు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. గతంలో ఎమ్మెల్యేలుగా గెలిచిన రేవంత్‌రెడ్డికి, పట్నం నరేందర్‌రెడ్డికి, మంత్రి మహేందర్‌రెడ్డికి రోడ్డు విషయం తెలిపితే గుంతల్లో మట్టి పోసి పూడ్చి వేశారని బీటీ రోడ్డు మాత్రం నిర్మించలేదని అన్నారు. ఈ నెల 20వ తేదీన కడా ప్రత్యేకాధికారిని కలిసి రోడ్డు నిర్మించాలని కోరగా రెండు మూడు రోజుల్లో పనులు ప్రారంభిస్తామని చెప్పినా పనులు ప్రారంభం కాలేదని వారు అన్నారు. వచ్చే నెల 2వ తేదీలోగా బీటీ రోడ్డు పనులు ప్రారంభించకుంటే సెప్టెంబర్ 4వ తేదీన కొత్తూరు నుంచి కొడంగల్ వరకు పాదయాత్ర చేసి మరోసారి కడా ప్రత్యేకాధికారికి వినతిపత్రం అందజేస్తామని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో రాంచంద్రయ్య, మోహన్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్ సేన అధ్యక్షుడిగా భాస్కర్‌నాయక్

కులకచర్ల, ఆగస్టు 29 : పరిగి నియోజకవర్గ సేవాలాల్ సేనా అధ్యక్షునిగా చౌడాపూర్ మండలం బజ్జ్యానాయక్‌తండాకు చెందిన భాస్కర్‌నాయక్ ఎన్నికయ్యారు. గురువారం హైదరాబాద్‌లోని సేవాలాల్ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబునాయక్, ప్రధాన కార్యదర్శి రేక్యానాయక్, వికారాబాద్ జిల్లా కొర్ర బాలకృష్ణనాయక్ ఆధ్వర్యంలో భాస్కర్ నాయక్‌ను పరిగి నియోజకవర్గం అధ్యక్షునిగా ఎన్నుకున్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన..

గుర్నానాథ్‌రెడ్డిని సన్మానిస్తున్న వీరశైవ సమాజం సభ్యులు

బొంరాస్‌పేట, ఆగస్టు 29 : మండలంలోని రేగడిమైలారం గ్రామంలో నూతనంగా నిర్మించిన బసవణ్ణ దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య విఘ్నేశ్వర, సుబ్రమణ్యేశ్వర, నందీశ్వర, నాగదేవత, పునర్ శిఖర ప్రతిష్ఠాపన కార్యక్రమాలను నిర్వహించారు. జంగం చంద్రకాంత్ శిశ్య బృందం ఆధ్వర్యంలో సిద్ధిలింగ మహాస్వామి చేతుల మీదుగా ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గుర్నానాథ్‌రెడ్డి హాజరై పూజలు చేశారు. ఆయనను మాజీ ఎంపీటీసీ జగదీశ్వరయ్య, దూపదీప నైవేద్య అర్చక సంఘం జిల్లా అధ్యక్షుడు జయతీర్థాచారి, వీరశైవ సమాజం సభ్యులు సన్మానించారు.

కురవ సంఘం మండల నూతన కమిటీ ఎన్నిక

పెద్దేముల్, ఆగస్టు 29 : గ్రామాల్లో కురవ సంఘం బలోపేతానికి ప్రతి సభ్యుడు కృషి చేయాలని కురవ సంఘం తాండూరు డివిజన్ అధ్యక్షుడు నాగారం జగదీశ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో మండల కురవ సంఘం సమావేశాన్ని నిర్వహించి పలు అంశాలను చర్చించి మండల నూతన కుర్వ సంఘం కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. నూతన అధ్యక్షుడిగా కె.గోపాలకృష్ణ, ఉపాధ్యక్షుడిగా కుర్వ బాలు, కార్యదర్శిగా బింగి రాఘవేందర్, సహాయ కార్యదర్శిగా జనగాం మాద అనంతయ్య, కోశాధికారిగా ఒగ్గు గోపాల్(గోపాల్ పూర్)లను ఏకగ్రీవంగా ఎన్నుకొని సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కురవ సంఘం తాండూరు డివిజన్ ఉపాధ్యక్షుడు పూజారిపాండు, చెంగోల్ వెంకటేశం,ప్రధాన కార్యదర్శి ఇందూరు మల్లేశం,కె.రవిశంకర్, హన్మయ్య, నర్సింహులు, రాష్ట్ర ఒగ్గు కథ,జానపద కళాకారుల సంఘం ఉపాధ్యక్షుడు ఎన్.నర్సింహులు,జిల్లా అధ్యక్షులు గొట్లపల్లి మల్లప్ప, మల్లికార్జున్,ఆయా గ్రామాల కురువ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

PLOT FOR SALE

★కరీంనగర్ హైవే ఫేస్ ఫేసింగ్‌కి DTCP, ఓపెన్ ప్లాట్స్, బెంగళూరు హైవేకి అతి దగ్గరలో అతి తక్కువ ధరలకే ప్లాట్స్ అమ్మబడును. బ్యాంక్ లోన్ Available, ఫోన్: 8885731233, 9948033142.
NT- 326218

LOST

★I, S.SURAVARDHAN REDDY, S/o. S.Krishna Reddy, R/o. H.No. 18-209/4/2/J/2, Ayyappa Colony, Shadnagar Town, Farooqnagar Mandal, Ranga Reddy Dist., Telangana. Lost My Secondary School Certificate Public Examination held in the Month of March Year 2012 with Register No. 1241124066 through Navajyothi High School, Shadnagar Town. If anyone found, please Contact: 8688984332 / 9949463061.
NT-331754

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

పిల్లలను పాఠశాలలకు పంపించాలి

దోమ, ఆగస్టు 29: తల్లిదండ్రులు పాఠశాలకు పంపిస్తే తమ పిల్లలను బడులకు వారికి విద్యను నేర్పించే బాధ్యతను తాము తీసుకుంటామని కిష్టాపూర్ కాంప్లెక్స్ హెచ్ఎం లాల్యానాయక్ అన్నారు. గురువారం కిష్టాపూర్ కాంప్లెక్స్ పరిదిలోని కిష్టాపూర్, బుద్లాపూర్, పెద్దతండాలో పాఠశాలకు రాని విద్యార్థుల వివరాలు తీసుకొని ఇంటింటికీ వెళ్లి వారి తల్లి దండ్రులతో మాట్లాడారు. ప్రతి రోజూ విద్యార్థులను పాఠశాలకు పంపాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యా యులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్యాసింజర్ ఆటో బోల్తా ..పలువురికి గాయాలు

మర్పల్లి, ఆగస్టు 29 : ప్యాసింజర్ ఆటో బోల్తా పడి ప్రయాణికులకు గాయాలైన సంఘటన మర్పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని కొత్లాపూర్ గ్రామ శివారులో గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మోమిన్ పేట్ మండలానికి చెందిన టాటా ఏసీ ప్యాసింజర్ ఆటోలో మోమిన్ పేట్ నుంచి మర్పల్లి వస్తుండగా ఆటో డ్రైవర్ వాహనాన్ని అజాగ్రత్తగా, వేగంగా నడపడంతో సిరిపురం-కొత్లాపూర్ గ్రామాల మధ్యలో కల్వర్టు వద్ద బోల్తా పడింది. అందులో ప్రయాణించిన ఏడుగురికి గాయాలు అయ్యా యి. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం 108 లో మర్పల్లి ప్రభుత్వ దవాఖానకు తర లించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేశ్ తెలిపారు.

దాడికి పాల్పడిన వారిని

అరెస్ట్ చేయాలి

పూడూరు,ఆగస్టు 29 : దళితులపై దాడిచేసి చంపేందుకు ప్రయత్నించిన వ్యక్తులపై ఎస్సీ,ఎస్టీ కేసునమోదు చేసి వెంటనే అరెస్ట్ చేయాలని కేవీపీఎస్ అంబేద్కర్ సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పరిగి డీఎస్పీ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు మహిపాల్, రాజు మాట్లాడుతూ పూడూరు మండల పరిధిలోని చింతల్‌పల్లి గ్రామానికి చెందిన మాదరం ప్రవీణ్ ఈ నెల 18వ తేదీన తన పొలం వద్దకు వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా అదే గ్రామానికి చెందిన రవీందర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, మోహన్‌రెడ్డి మార్గ మధ్యలో అడ్డగించి దాడికి పాల్పడ్డారని తెలిపారు. ప్రవీణ్‌పై దాడికి పాల్పడిన వ్యక్తులపై చన్గోముల్ ఎస్సై మధుసూదన్‌రెడ్డికి 12 రోజు క్రితం ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని డీఎస్పీ కార్యాలయం ఎదుట గురువారం నిరసన తెలిపినట్లు వారు తెలిపారు. ఎస్సై దళితులపైనే కేసు నమోదు చేసి జైలుకు పంపించారని ఆరోపించారు. దాడికి పాల్పడి వ్యక్తులు,, ఎస్సై పై కూడా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. దళితులకు న్యాయం జరుగకపోతే డీఎస్పీ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. సంఘం నాయకులు రాజు, రాము లు, బుచ్చయ్య,చిన్నయ్య,యాదయ్య, సాయికుమార్, వెంకటయ్య, రాఘవేందర్, దిలీప్, జంగయ్య తదితరులు ఉన్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తి మృతి

బషీరాబాద్, ఆగస్టు 29 : మతిస్థిమితం లేని వ్యక్తి మృతి చెందిన ఘటన అల్లాపూర్ గ్రామ శివారులో గురువారం వెలుగు చూసింది. ఏఎస్సై నారాయణ తెలిపిన వివరాల ప్రకారం..నిజామాబాద్ జిల్లా, కోటగిరి మండలం, ఎతొండ గ్రామానికి చెందిన రెడ్డి రవి(41), భార్యతో కలిసి ఈ నెల 22 తేదీన తిరుపతికి వెళ్లి తిరిగి గ్రామానికి రైలులో వెళ్తుండగా మార్గమధ్యంలో నవాంధ్రి (బషీరాబాద్) రైల్వే స్టేషన్‌లో మతిస్థిమితం లేకుండా పిచ్చిగా ప్రవర్తించి రైలు దిగి పోయినట్లు తెలిపారు. అంతలోనే రైలు వెళ్లి పోవడంతో వికారాబాద్ రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేయగా, వారు మిస్సింగ్ కేసుగా నమోదు చేసుకుని స్థానిక పోలీసులతో కలిసి వెతికినట్లు పేర్కొన్నారు. కానీ అతడి ఆచూకీ తెలియలేదని చెప్పారు. అయితే అల్లాపూర్ గ్రామం శివారులోని ఓ వ్యవసాయ పొలంలో గుర్తుతెలియని వ్యక్తి చనిపోయినట్లు పోలీసులకు సమాచారం అందింది. పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి తప్పిపోయిన వ్యక్తి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు వచ్చి శవాన్ని గుర్తు పట్టినట్లు పోలీసులు తెలిపారు. మతిస్థిమితం లేక ఆహారం తీసుకోక చనిపోయి ఉంటాడని, మృతుడి మరణంపై ఎలాంటి అనుమానం లేదని కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
Telangana Today
FOR LOCAL TO GLOBAL NEWS
పుట్టినరోజు, పదవీ విరమణ, వార్షికోత్సవ శుభాకాంక్షలు,
వర్ధంతి, జయంతి, లీగల్ నోటీసులు
మరియు ఇతర ప్రకటనల కొరకు
ఈ దిగువ తెలిపిన నెంబర్లపై సంప్రదించగలరు.
ప్రకటనల విభాగం సెల్: 80966 77655
వికారాబాద్/పరిగి/ శంకర్‌పల్లి
తాండూర్/కొడంగల్
ఇబ్రహీంపట్నం/మహేశ్వరం
: 80966 77668
: 80966 77962